ప్రమాణస్వీకారోత్సవ సంబరాలు

సీఎంగా చంద్రబాబు నాయుడు, మంత్రిగా పవన్‌కల్యాణ్ ప్రమాణస్వీకారోత్సవాన్ని జిల్లా ప్రజలు బుధవారం ఆసక్తిగా తిలకించారు. పలుచోట్ల బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు.


ప్రమాణస్వీకార సమయంలో కాకినాడలో బాణసంచా కాలుస్తూ టీడీపీ శ్రేణుల సంబరాలు


గొల్లప్రోలులో బాణాసంచా కాలుస్తున్న టీడీపీ శ్రేణులు



కాకినాడలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్


పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు, వీరమహిళలు


పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



కాకినాడ నగరంలో కేక్ కట్ చేస్తున్న జనసేన నేతలు

మూడు జిల్లాలకు.. మూడు


డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



కందుల దుర్గేష్


వాసంశెట్టి సుభాష్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురిని మంత్రి పదవులు వరించాయి. ముందుగా ఊహించినట్టుగానే జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవి లభించింది.. ఇక నిడదవోలు నియోజకవర్గం నుంచి జనసేన నాయకుడు కందుల దుర్గేష్‌కు చోటు దక్కింది.. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్‌ను అనూహ్యంగా మంత్రి పదవి వరించింది.. ఈ ముగ్గురూ తొలిసారే ఎమ్మెల్యేలుగా ఎన్నికవడం గమనార్హం. కాకినాడ, తూర్పు గోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులుగా ఎన్నికవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే పార్టీలోని సీనియర్లు మాత్రం గుర్రుగా ఉన్నారు.

- డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్
- కేబినెట్‌లో దుర్గేష్, సుభాష్‌లకు చోటు
- ముగ్గురూ తొలిసారిగా ఎమ్మెల్యేలు
- సామాజికవర్గాల వారీగా కేటాయింపు
- మూడు జిల్లాలకు ముగ్గురు మంత్రులు
- శాఖల కేటాయింపుపై ఎదురుచూపులు
- సీనియర్లకు దక్కని మంత్రి పదవులు

పవర్ స్టార్



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబు కేబినెట్‌లో జిల్లాకు మరోసారి పెద్దపీట లభించింది.మంత్రివర్గ కూర్పులో ఐదేళ్ల తర్వాత మళ్లీ జిల్లాకు డిప్యూటీ సీఎం పదవి లభించింది. పిఠాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను డిప్యూటీ సీఎంగా పదవి వరించింది. ఈ మేరకు బుధవారం పవన్ డిప్యూటీ సీఎం హోదాలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన పవన్ మంత్రిగాను బాధ్యతలు స్వీకరించడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఆనందం మిన్నంటుతోంది.జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయంగా ఈ ఎన్నికల్లో కాకినాడ జిల్లాపై పూర్తిస్థాయిలో దృష్టిసారించారు.తన వారాహి రాజకీయ యాత్రను జిల్లా నుంచే ప్రారంభించారు.2019 ఎన్నికల్లో భీమవరం,గాజువాక స్థానాల నుంచి పోటీచేసి ఓటమి పాలవడంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభలో అడుగుపెట్టాలని పవన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. సామాజికపరంగా,అభిమానులపరంగా అనువుగా ఉన్న పిఠాపురాన్ని ఎంచుకుని పోటీచేశారు.పవన్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.72వేలకుపైగా మెజార్టీ ఇచ్చారు.దీంతో పవన్ తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. కూటమి విజయంలో కీలకపాత్ర పోషించడంతో జనసేనకు మంత్రి పదవులు లభించాయి. ఇప్పుడు అందరి దృష్టి పవన్‌పైనే నెలకొంది. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే 14 అంశాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పవన్ తన అజెండాలో ప్రకటించారు.ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం హోదాలో పవన్ తన పనితీరు ఎలా చూపిస్తారనేది ఆసక్తిగా మారింది.ప్రస్తుతం పవన్ చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి.వీటిని పూర్తి చేసి కొత్తవి అంగీకరించకుండా జిల్లాపై పూర్తి స్థాయిలో దృష్టిపెడతారని చెబుతున్నారు.

ఆ రెండూ రెండో సారే..

పవన్ డిప్యూటీ సీఎం హోదాలో మంత్రి అయిన నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గానికి ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ కీలకమైన గుర్తింపు వచ్చినట్లయింది. 1992లో కాంగ్రెస్ తరపున ఈ నియోజకవర్గం నుంచి కొప్పన మోహనరావు ఎమ్మెల్యేగా రెండోసారి నెగ్గి కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రి వర్గంలో అటవీశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్ల తర్వాత నియోజకవర్గానికి మంత్రి పదవి లభించింది. డిప్యూటీ సీఎం పదవి హోదా తొలిసారి నియోజకవర్గానికి లభించింది. మరో పక్క డిప్యూటీ సీఎం పదవి రెండోసారి జిల్లాకు లభించినట్లయింది. 2014లో ఏర్పడ్డ టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు మంత్రివర్గంలో పెద్దాపురం ఎమ్మెల్యేగా విజయం సాధించిన నిమ్మకాయల చినరాజప్పకు డిప్యూటీ సీఎం హోదాలో హోంమంత్రి అయ్యారు. ఐదేళ్ల తర్వాత ఇప్పుడు అదే టీడీపీ ప్రభుత్వంలో పవన్ రూపంలో జిల్లాకు డిప్యూటీ సీఎం పదవి వచ్చింది. మాజీ మంత్రులు యనమల,రాజప్ప, సీనియర్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తదితరులు మంత్రి పదవికి అవకాశం ఉంటుందేమోనని భావించారు. కూటమి ప్రభుత్వంలో భాగంగా పదవులు ఇవ్వాల్సి రావడంతో టీడీపీకి వచ్చే మంత్రి పదవుల్లో కొంత కోత పడింది. జిల్లాలో టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవి దూరమైంది.పార్టీలో కొత్త రక్తాన్ని ఎక్కించాలనే విధానంలో భాగంగా ఈ దఫా సీనియర్లకు ఛాన్స్‌లు దక్కలేదు.

నిడదవోలుకు.. తొలి మంత్రి

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కందుల దుర్గేష్‌ను అదృష్టం వరించింది..చంద్రబాబు మంత్రివర్గంలో జిల్లా నుంచి నిడదవోలు జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేష్ అవకాశం దక్కింది.జిల్లా నుంచి సీనియర్ నేతలు,కొత్తవారూ మంత్రి పదవులు ఆశించారు. కానీ కందుల దుర్గేష్ ఒక్కరికే జిల్లా నుంచి అవకాశం దక్కింది. తాత రాజమహేంద్రవరం మాజీ ఎమ్మెల్యే మూడు సార్లు మునిసిపల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన పోతుల వీరభద్రరావు వారసుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. విద్యార్థి నాయకుడిగా జీవితం ఆరంభించిన దుర్గేష్ అంచలం చెలుగా ఎదిగారు. కాపు సామాజిక వర్గానికి చెందిన దుర్గేష్ అన్ని సామాజికవర్గాల్లో మంచి వాడిగా పేరుతెచ్చుకోవడం గమనార్హం. ఎన్నికల సంగ్రామంలో ఉండగా ఆయన సతీమణి అనారోగ్యంతో మృతి చెందారు.ఎన్నికల ప్రచారంలో ఉండగా ఆయన తల్లి కాలం చేశారు. ఆ కష్టాలను దిగమింగుకుని ప్రజలతో మమేకమై వారి మనసులు చూరగొన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్న ఆయన రాజమహేంద్రవరం రూరల్ నుంచి జనసేన టికెట్ ఆశించారు. అయితే టీడీపీ సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉండడంతో దుర్గేష్‌కు అవకాశం దక్క లేదు. దీంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుతో సంప్రదించి నిడదవోలు నుంచి పోటీ చేయించారు. దుర్గేష్‌కు కొత్త నియోజకవర్గమైనా ఒంటరిగా వెళ్లి ఓటర్ల మనసు చూరగొని విజయం సాధించగలిగారు.అనుహ్యంగా ఎమ్మెల్యేగా విజయం సాధించడమే కాకుండా ఏకంగా ఇవాళ చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి పదవి సాధించారు.జిల్లాలో ఏకైక మంత్రిగా తెరమీదకు వచ్చారు.ఆయనకు మంత్రి పదవి దక్కడంతో జిల్లా వ్యాప్తంగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.గత ఎన్నికల్లో రూరల్ నుంచి పోటీ చేశారు.ఈసారి పొత్తుల వల్ల ఆయనను నిడదవోలు నుంచి పోటీ పెట్టగా, ఎమ్మెల్యేగా ఎన్నికడంతో పాటు మంత్రి కూడా అయ్యారు.

నిడదవోలుకు తొలి మంత్రి

నిడదవోలు నియోజకవర్గం 2009 ముందు జరిగిన పునర్విభజనలో ఏర్పడింది. అప్పటి వరకూ ప్రస్తుతం ఉన్న నిడదవోలు మండలం కొవ్వూరులో, ఉండ్రాజవరం మండలం తణుకు నియోజకవర్గం, పెరవలి మండలం పెను గొండ నియోజకవర్గంలో ఉండేవి. ఈ మూడు మండలాలు కలిపి ఏర్పడిన నిడదవోలు నియోజకవర్గానికి తొలిసారిగా మంత్రి పదవి దక్కడం గమనార్హం.

నూతన అధ్యాయానికి నాంది
కందుల దుర్గేష్, మంత్రి



కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం లభించడం నా అదృష్టం. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి వర్గంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది.ఆ దుర్మార్గ పాలనకు ప్రజలు అంతం పలికారు. నూతన అధ్యాయానికి నాంది పలికారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అనుభవం కలిగిన చంద్రబాబు యుక్తి, శక్తిమంతుడైన పవన్‌శక్తి, ప్రధాని మోదీ స్ఫూర్తితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకుని వెళ్లవలసి ఉందన్నారు. అభివద్ధి, సంక్షేమం సమపాలనతో ముం దుకెళతామన్నారు. నిడదవోలు నియోజకవర్గాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. కొత్త జిల్లానూ, ఉమ్మడి జిల్లాలను కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేశా రు. మనకు పోలవరం పూర్తి కావడం అత్యవసరం. రోడ్లు, డ్రైన్లు వంటి మౌలిక సదుపాయాలు కూడా అవసరమని స్పష్టం చేశారు.

సుభాష్‌కు కలిసొచ్చిన అదృష్టం..



(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఒక కార్యకర్త మంత్రి అయ్యారు.. అదృష్టం కలిసి వస్తే ఎవరూ అడ్డుకోలేరనే దానికి సుభాష్ సంఘటనే ఒక ఉదాహరణ. అమలాపురానికి చెందిన వాసంశెట్టి సుభాష్ మూడు నెలల కిందట మండపేటలో తెలుగుదేశం పార్టీలో చేరారు. రామచంద్రపురం స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఘన విజయం సాధించారు. ఎమ్మెల్యే ఎన్నికైన కొన్ని రోజుల్లోనే చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం లభించింది. సామాజికవర్గ సమీకరణల నేపథ్యంలో సుభాష్‌ను పదవి వరించింది. సుభాష్ వైసీపీలో ఒక సాధారణ కార్యకర్త వైసీపీ విధానాలు నచ్చకపోవడం.. నాటి మంత్రి పినిపే విశ్వరూప్‌తో పొసగకపోవడంతో పార్టీ దూరమయ్యారు. అనంతరం సుభాష్ తన రాజకీయ జీవితాన్ని కీలకంగా మలుపు తిప్పుకోగలిగారు. మండపేట ప్రచారానికి వచ్చిన చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన సుభాష్ వెంటనే రామచంద్రపురం నుంచి బరిలో దిగారు. నియోజకవర్గం కొత్తదైనా రాజకీయ దిగ్గజాలు ఉన్న నియోజకవర్గంలో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతూ టీడీపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించారు. అనూహ్యంగా చంద్రబాబు మంత్రివర్గంలో కోనసీమ జిల్లా నుంచి స్థానం లభించిన ఏకైక వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. కోనసీమ జిల్లాలో ఇద్దరు కీలక ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో స్థానం లభిస్తుందని కొన్ని రోజులుగా ప్రచారం జరిగింది. కానీ సామాజికవర్గాల సమతూకంలో భాగంగా వారికి మంత్రి పదవులు రాలేదని తెలుస్తోంది. కూటమి గెలుపులో జనసేన కీలక పాత్ర పోషించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన కోటాలో రెండు మంత్రి పదవులు పవన్‌కల్యాణ్, కందుల దుర్గేష్‌లకు వెళ్లాయి. దీంతో వారి సామాజికవర్గం నుంచి టీడీపీలో ఉన్న ఇతరులకు అవకాశం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లాలోని బలమైన సామాజిక వర్గంనుంచి పోటీ చేసి గెలిచిన సుభాష్‌కు అదృష్టం కలిసి వచ్చింది. రామచంద్రపురం నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన చెల్లుబోయిన వేణు వైసీపీ హయాంలోను, గతంలో ఇక్కడి నుంచి పోటీ చేసి గెలిచిన పిల్లి సుభాష్ చంద్రబోస్ సైతం కాంగ్రెస్ హయాంలోను, ఎమ్మెల్సీగా ఉంటూ వైసీపీ హయాంలోను మంత్రి పదవి పొందారు. వీరంతా ఒకటే సామాజికవర్గం కావడం గమనార్హం. ఇలా వరుసగా రామచంద్రపురం నుంచి ఎన్నికైన పిల్లి సుభాష్‌చంద్రబోస్, చెల్లుబోయిన వేణు, ఇప్పుడు కూటమినుంచి గెలిచిన వాసంశెట్టి సుభాష్‌కు మంత్రి పదవి దక్కిందని పలువురు భావిస్తున్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించిన అధికారులు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకార మహోత్సవాన్ని జిల్లా అధికారులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. కలెక్టరేట్ వివేకానంద హాల్‌నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే కార్యక్రమానికి కలెక్టర్ జె.నివాస్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, అటవీశాఖ అధికారి భరణి, ఇతరశాఖల అధికారులు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు గన్నవరం కేశనపల్లిలో జరుగుతున్న సీఎం చంద్రబాబునాయుడు, ఇతర మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, ఇతర ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించేందుకు అధికార యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 19 ఎల్ఈడీ స్క్రీన్‌లు, టీవీ సెట్ల ద్వారా ప్రమాణస్వీకార కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో జిల్లా వాసులు చూశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారి శ్రీరమణి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో ప్రమాణస్వీకార మహోత్సవాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

9చోట్ల ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 12: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవాన్ని నగరపాలక సంస్థ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రజలు వీక్షించారు. కాకినాడ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన స్క్రీన్ వద్ద నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఇతర అధికారులు సీఎం ప్రమాణస్వీకారం తిలకించారు. జిల్లా కేంద్రంలో తొమ్మిది ప్రాంతాల్లో ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఈ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, కార్యదర్శి ఏసుబాబు, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, డీసీపీ హరిదాసు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయంలో ప్రమాణస్వీకారోత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- జిల్లాలో 1,38,257మంది విద్యార్థులకు అందని బ్యాగ్‌లు
- అరకొరగానే పుస్తకాలు.. గత ప్రభుత్వ తప్పిదంతో జాప్యం

కాకినాడ రూరల్, జూన్ 12: విద్యాసంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు విద్యాకానుకను అందజేస్తామని గత ప్రభుత్వం గొప్పగా చెప్పినా ఏఒక్క ఏడాది కూడా ఆవిధంగా అందించిన దాఖలాలు లేవు. గత వైసీపీ ప్రభుత్వం ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలోనైనా పూర్తిస్థాయిలో విద్యాకానుకను అందిస్తుందని ఆశించినా వారి తప్పిదం వల్ల పుస్తకాలు అరకొరగాను, బ్యాగ్‌లను మొత్తానికి అందించలేదు. ప్రభుత్వం మారుతుందని వైసీపీ ముందుగానే గ్రహించిందో లేదా కమీషన్లు కుదరలేదో తెలియదు గానీ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు అందలేదు. ఆ బ్యాగ్‌లు ఒక ఏడాది పరిమాణం చిన్నవి రాగా, మరో ఏడాది నాసిరకంగా ఉండడంతో ఇచ్చిన వారంరోజులకే బ్యాగ్‌లు చిరిగిపోయాయి. ఈ సమస్యను అప్పట్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా ఇచ్చిన బ్యాగ్‌లను విద్యార్థులనుంచి వెనక్కి తీసుకున్నారుగానీ వారికి ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులే సొంతంగా బ్యాగ్‌లను కొనుగోలు చేసుకున్నారు. దీంతో జగనన్న విద్యాకానుకలు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. విద్యా కానుక కిట్‌లో మూడు జతల ఏకరూప దుస్తులు, ఒక సెట్ రాత, పాఠ్యపుస్తకాలు, ఒక జతబూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూల్ బ్యాగ్ ఉన్నాయి. 1నుంచి 3 తరగతులకు ఒక సైజు, 4నుంచి 6 తరగతులకు ఒకటి, 7 నుంచి 10 తరగతులకు మరొకటి మొత్తంగా మూడు సైజుల బ్యాగ్‌లను విద్యార్థులకు అందిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నా నేటికీ బ్యాగ్‌లు కాకినాడ జిల్లాకు కేంద్రానికి చేరలేదు. దీంతో విద్యార్థులకు బ్యాగ్‌లు అందుతాయా లేదా అనే అనుమానాలు వారిలో అలముకున్నాయి. పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 12 వరకూ సెలవులు ప్రకటించడంతో గురువారం పునఃప్రారంభం కానున్నాయి. కాకినాడ జిల్లాలో 1,38,257మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేయాల్సి ఉంది.

వేటకు వేళాయె?

- రేపటితో సముద్ర జలాల్లో నిషేధం గడువు ముగింపు
- వేటకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఫిషింగ్ బోట్లు

కాకినాడ సిటీ/కొత్తపల్లి జూన్ 12: మరో 24 గంటల్లో సముద్ర జలాల్లో చేపలవేట నిషేధం గడువు ముగుస్తుండడంతో ఫిషింగ్ బోట్లను సిద్ధం చేస్తున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులపాటు వేట నిషేధం అమలు కా వడంతో మత్స్యకారులు బోట్ల మరమ్మతులు, వలల అల్లికలతో ఈ సమయం గడిపారు. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించే పరిహారం మాత్రం ఇంతవరకు మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. దీంతో బోట్లపై వేటకు వెళ్లే మత్స్యకారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు వేటకు వెళ్లేందుకు ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడి పెడుతున్నారు. కాకినాడలో దుమ్ములపేట, పర్లోవపేట, ఏటిమొగ ప్రాంతాలకు చెందిన వారికి, కొత్తపల్లిలో పలు మత్స్యకార గ్రామాల్లోను ఫిషింగ్ బోట్లు ఎక్కువగా ఉన్నాయి. ఎన్నికల కోడ్‌వల్ల మత్స్యకారుల గుర్తింపు ప్రక్రియ ఆలస్యమైంది. గత ప్రభుత్వం ఎన్నికల్లో ఓటమి చెందడంతో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాత్రమే పరిహారం జమయ్యే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్, తాళ్లరేవు, కరప మండలాల పరిధిలో 4,600 ఫిషింగ్ బోట్లు ఉన్నాయి. వీటిలో 350 మెకనైజ్‌డ్, 4,250 మోటరైజ్‌డ్ బోట్లు ఉండగా, వీటిపై 24వేలమంది మత్స్యకారులు సముద్రజలాల్లో చేపల వేట సాగిస్తున్నారు. మెకనైజ్‌డ్ బోటుపై ఆరుగురికి, మోటరైజ్‌డ్ బోటుపై 8మందికి వేట విరామ పరిహారం అందించనున్నారు. ఫిషింగ్ బోట్లపై జీవనోపాధి పొందే మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున అందించే ఈ పరిహారం నిమిత్తం ప్రతిఏటా మాదిరిగానే ఈ ఏడాది జరగాల్సిన అర్హుల గుర్తింపు ఆలస్యమైంది.



సభా వేదిక వద్ద కోలాహలం





వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజినీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

కల్యాణోత్సవాలకు ముస్తాబవుతున్న అప్పనపల్లి

- 17న స్వామివారి తిరుకల్యాణం

మామిడికుదురు, జూన్ 12: వైనతేయ గోదావరి తీరంలో ఉన్న బాలతిరుపతిగా వర్ధిల్లుతున్న అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారి కల్యాణోత్సవాలకు అప్పనపల్లి ముస్తాబవుతోంది. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని వివిధ రకాల రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కల్యాణోత్సవాలు ఈ నెల 16వ తేదీ ఆదివారం నుంచి 20న గురువారం వరకు ఐదు రోజుల పాటు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. స్వామివారి తిరు కల్యాణాన్ని జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తంలో ఈనెల 17వ తేదీ సోమవారం రాత్రి 8.59 గంటలకు నిర్వహించనున్నట్టు తెలిపారు. జ్యేష్ఠశుద్ధ దశమి 16న ఆదివారం ఉదయం సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలకు శ్రీకారం చుడతామని, ఆదేరోజు సాయంత్రం విశ్వక్సేన ఆరాధనతో కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందని తెలిపారు. ఈ కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతీరోజు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చనలు ఏర్పాటు చేశామని, 18న మంగళవారం సాయంత్రం 4 గంటలకు వేద పండితుల సదస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. స్వామివారికి చక్రస్నానం 19న బుధవారం ఉదయం 10 గంటలకు, 20న గురువారం ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, రుత్విక్ సన్మానంతో స్వామివారి ఉత్సవాలు పరిపూర్ణమవుతాయని తెలిపారు. కల్యాణోత్సవం జరిగే ఐదురోజులు వివిధ రకాల సాంస్కృతిక, ఆధ్యాత్మిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కల్యాణోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఏసీ కోరారు.

పద్మ అవార్డ్సు కోసం దరఖాస్తుల ఆహ్వానం

సర్పవరం జంక్షన్, జూన్ 12 : వివిధ రంగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరచిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం అందించే పద్మ అవార్డ్సు-2025 కోసం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్రాజ్ సీఈవో ఏవీఎస్ఎన్ మూర్తి ఓ ప్రకటనలో కోరారు. సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యరంగం, సామాజిక సేవ లు, సైన్స్ ఇంజనీరింగ్, ప్రజావ్యవహారాలు, పౌరసేవలు, వృత్తి, పరిశ్రమ వంటి రంగాల్లో అత్యున్నతమైన ప్రతిభ కనబరచిన వారికి పద్మ అవార్డు అందించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రీయ పురష్కార్ పోర్టల్ htpps://awards.gov.in వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తుతో పాటూ సంబంధిత ధ్రువీకరణ రెండు సెట్ల పత్రాలను కాకినాడరూరల్ రమణయ్యపేట జిల్లా యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్)లో ఈనెల 20వ తేదీలోపు అందజేయాలని కోరారు. వివరాల కోసం 9849913065, 8919135344 సంప్రదించాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంతో మహిళలకు రక్షణ

- కుమార్తె వైద్యం కోసం సీఎం చంద్రబాబును కలుస్తా: ఆరుద్ర

సర్పవరం జంక్షన్, జూన్ 12: సీఎం జగన్ పాలనలో మహిళలకు రక్షణ, భద్రత లేకుండాపోయింది. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మహిళలకు అన్ని విధాలుగా భరోసా కలుగుతుంది. నా కుమార్తె సాయిలక్ష్మీ చంద్ర వెన్నెముక అనారోగ్యంతో బాధపడుతోంది. సర్జరీ కోసం కోట్లు రూపాయలు అవసరం అవుతాయి. సొంత ఆస్తి విక్రయించి ఆపరేషన్ చేయిద్దామంటే వైసీపీ నాయకులు అడుగడుగునా అవరోధాలు కల్పించి ఆస్తి విక్రయించుకోలేని స్థితిలో కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. న్యాయం కోసం పోరాడితే ప్రభుత్వ పెద్దలు నా కుమార్తెను నన్ను పిచ్చాసుపత్రికి తరలించి మానసికంగా వేధింపులకు గురి చేశారు. అధికారులు, పోలీసుల వేధింపులు తట్టుకోలేక కాకినాడరూరల్ రాయుడుపాలెంలో సొంతిల్లు విడిచిపెట్టి వేరే రాష్ట్రంలో వారణాసిలో ఇప్పటివరకు తలదాచుకున్నా. వైసీపీ ప్రభుత్వ హయాంలో తన కుటుంబంపై వేధింపులు తప్పించి, తనకు నయాపైసా ఆర్థిక సహకారం అందలేదని, కేటీసీ విద్యాసంస్థల ఛైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి ఆర్థిక సహకారం అందించారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో వైసీపీ పార్టీ ఓడిపోయి, ప్రజాశీస్సులతో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ఆహ్వానం రావడంతో బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి కుమార్తెతో సహా వచ్చినట్లు రాజులపూడి ఆరుద్ర తెలిపింది. సీఎంతోపాటూ మంత్రి లోకేష్‌ని వ్యక్తిగతంగా కలుసుకుని సీఎంగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపానన్నారు. తన కుమార్తె ఆరోగ్యం కోసం వైద్య సహాయం, ఆస్తుల విక్రయంపై అడ్డంకులు సృష్టిస్తున్న మాజీ మంత్రి వద్ద పనిచేసిన కానిస్టేబుల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరతా నన్నారు. నా కుమార్తెకు చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లు న్యాయం చేస్తారనే నమ్మకం ఉందన్నారు.



సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార ప్రాంగణంలో ఆరుద్ర

రేషన్ బియ్యం స్వాధీనం

ఏలేశ్వరం, జూన్ 12: కాకినాడజిల్లా ఏలేశ్వరంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గొల్లలమెట్ట వీధిలో ఒక ఇంట్లో అక్రమంగా కొనుగోలుచేసి నిల్వ ఉంచిన బియ్యాన్ని ముందస్తు సమాచారంతో రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఆ ఇంట్లో 53 బస్తాల్లో ఉన్న సుమారు 2650 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ ఉంచిన ఊటా మణీంద్రపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో అధికారులు గంధం రవి, రెవెన్యూ అధికారులు కె. సత్యారావు, చిన్నారి పాల్గొన్నారు.



పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు



వేంకటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో రోడ్డుపై దగ్ధమవుతున్న మోటారు సైకిల్

ద్విచక్ర వాహనం దగ్ధం

అమలాపురం టౌన్, జూన్ 12: స్థానిక మహిపాలవీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా జాతీయ రహదారిపై వెళుతున్న ద్విచక్ర వాహనం బుధవారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. యువకులు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పొగలు రావడంతో అప్రమత్తమై మోటారు సైకిల్‌ను నిలుపుదల చేసి స్టాండ్ వేశారు. అప్పటికే మంటలు ఒక్కసారిగా చెలరేగి ఆ వాహనం పూర్తిగా కాలిపోయింది. అయితే ఆ వాహనం ఎవరిదో తెలియలేదు. మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవాల్లో భాగంగా సైలెన్సర్లు తీసి మోటారు సైకిళ్లు నడుపుతున్న రెండింటిని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అదేవిధంగా నంబరు ప్లేటు లేని కారుని కూడా సీజ్ చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

'ఉత్తమ సాహిత్యంతో సంస్కారవంతమైన సమాజం'



డాక్టర్ యనమదల మురళీకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 12: మానవ విలువలను ప్రబోధించే మంచి సాహిత్యంతో సమాజాన్ని సంస్కరించవచ్చని ప్రముఖ సాహితీవేత్త కట్టమంచి బాలకృష్ణారెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని రాజమహల్‌లో బుధవారం జరిగిన కుప్పం రెడ్డమ్మ సాహిత్య అవార్డుల ప్రదానం కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. చిత్తూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలు కె.రామలక్ష్మి తన తల్లి స్మృతికి నివాళిగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ సాహిత్య ప్రక్రియల్లో ప్రతిభ చూపిన రచయితలు, కవులకు 31ఏళ్లుగా సాహితీ అవార్డులు ఇస్తున్నారు. 2024 సంవత్సరానికి కాకినాడకు చెందిన డాక్టర్ యనమదల మురళీకృష్ణ సహా మరికొందరికి అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కె.రోజాప్రియ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

గోదావరిలో తేలిన ఈవోపీఆర్డీ మృతదేహం

రాజమహేంద్రవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో అదృశ్య మైన ఓ ప్రభుత్వాధికారి రాజమహేంద్రవరంలోని గోదావరిలో శవమై తేలారు. సీఐ పుల్లారావు, మృతుడి సోదరుడు వరప్రసాద్ తెలిపిన వివ రాల ప్రకారం.. పిండాల రేవులో ఓ శవం గోదావరిలో కొట్టుకువచ్చిందని వీఆర్వో ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. దీనిపై వేగంగా దర్యాప్తు చేయడంతో ఉయ్యూరు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైందని తెలిసింది. తోట్లవల్లూరుకు చెందిన సుంకర వెంకటరమణారావు(61) ఈవోపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన తల్లి బందరులో ఉం టున్నారు. అప్పుడప్పుడు అక్కడికి వెళ్తారు. ఆ క్రమంలో తల్లి దగ్గరకు వెళ్తున్నానని సోమవారం పిల్లలకు మెస్సేజ్ పెట్టారు. మరుసటి రోజు రాకపోవడం, ఫోన్ పనిచేయకపోవడంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమణారావుకు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. పెద్ద అమ్మాయి భర్త కోవిడ్ సెకండ్ వేవ్‌లో చనిపోయారు. ఆ బాధ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతికి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

యువతి అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యువతి అనుమానాస్పద మృతిపై ప్రకాశంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలవరం మండలం తోటగొందికి చెందిన మిడియం రాజ్యలక్ష్మి(21) రంపచోడవరం సమీపంలో ఉన్న తన స్నేహితురాలి పెళ్లికి ఈనెల 5న వెళ్లింది. పదో తేదీ(సోమవారం) ఉదయం తల్లికి ఫోన్‌చేసి రాజమండ్రి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్నానని చెప్పింది. బావను పంపిస్తానని, అక్కడే ఉండాలని తల్లి చెప్పారు. ఆయన వెళ్లేసరికి రాజ్యలక్ష్మి వాంతులు చేసుకుంటోంది. బావ ప్రశ్నించగా పురుగుల మందు తాగానని చెప్పిందని ఫిర్యాదులో తల్లి వీరలక్ష్మి పేర్కొన్నారు.రాజ్యలక్ష్మిని ప్రభుత్వాస్పత్రికి తరలించగాచికిత్సపొందుతూ బుధవారం మరణించింది.

నివాస ప్రాంతాల మధ్య సెల్‌టవర్ నిర్మించవద్దు

అంబాజీపేట, జూన్ 12: వాకలగరువు చెరువుగట్టు ప్రాంతంలో నివాస ప్రాంతాల మధ్య సెల్ టవర్ నిర్మించవద్దని స్థానికులు ఆందోళన చేపట్టారు. టవర్ నిర్మాణం మొదలుపెట్టే సమయంలో స్థానికులు అడ్డుకుని సెల్ టవర్ నిర్మాణంతో స్థానిక ఉన్న ప్రజలు రేడియేషన్‌తో ఇబ్బందులు పడతారని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులకు వినతిపత్రాన్ని అందించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1,05,651 విరాళం

మామిడికుదురు, జూన్ 12: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు గ్రామానికి చెందిన బుద్దాల వెంకటేశ్వరరావు-సత్యవాణి దంపతులు రూ.1,05,651 విరాళం అందించారు. భక్త దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని సహాయ కమిషనర్ జి.మాధవి అందించి అభినందించారు. కార్యక్రమంలో బొక్కా సత్యంమూర్తి, బొంతు దుర్గాప్రసాద్, ఆలయ అర్చకుడు గొడవర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ యాత్రికులపై తీవ్రవాదుల దాడి అమానుషం

అమలాపురం టౌన్, జూన్ 12: జమ్ముకశ్మీర్‌లో వైష్ణోమాత ఆలయానికి వెళుతున్న హిందూ యాత్రికులపై తీవ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భజరంగ్‌దళ్ రాష్ట్ర సహ ప్రముఖ్ శిరంగు నాయుడు, నగర ప్రముఖ్ ఊటుకూరి సాంబయ్య, గోళ్ల వీరబాబు, భీమనాథం రవికృష్ణ, కర్రి పార్థసారథి, యక్కల బ్రమేష్, దొంగ రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, రంగబాబు పాల్గొన్నారు.



గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న భజరంగ్‌దళ్ నాయకులు

వ్యక్తి అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అనుమానాస్పద మృతిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఉమర్ తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం కూరాడకు చెందిన శ్రీరామచంద్రమూర్తికి రాజమహేంద్రవరానికి చెందిన వరలక్ష్మీతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. ప్రస్తుతం స్పిన్నింగ్ మిల్ కాలనీలో నివాసం ఉంటున్నారు. శ్రీరామ్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఓ కార్ల షోరూంలో పనిచేస్తుండగా ఏడాది క్రితం శాటిలైట్ సిటీకి చెందిన దేవితో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో శ్రీరామ్ ఆమె వద్దనే ఎక్కువగా ఉంటున్నాడు. గత బుధవారం ఓ పాన్‌షాప్ నుంచి వరలక్ష్మికి ఫోన్ చేసి రమ్మన్నాడు. ఆమె వెళ్లగా అతడు గాయాలతో ఉన్నాడు. దీంతో ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లింది. ఆదివారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో దేవి ఇంటికే వెళ్లి ఉంటాడని వరలక్ష్మి భావించారు. అయితే టీడీసీ సెంటర్ సమీపంలోని రోడ్డుపై శ్రీరామ్ విగతజీవిగా పడి ఉన్నాడనే సమాచారంతో వరలక్ష్మి అక్కడికి చేరుకుంది. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

మరిడమ్మకు పంచామృతాభిషేకం

పెద్దాపురం, జూన్ 12: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారి జన్మ నక్షత్రం మఖను పురస్కరించుకుని బుధవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా వారికి ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా సంబరాలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి మండలి ప్రమాణ స్వీకారాన్ని తిలకించిన ప్రజలు
- ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు
- బాణసంచాతో సందడి చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు
- పలుచోట్ల కేక్ కటింగ్‌లు, స్వీట్లు పంపిణీ




కాకినాడ సిటీ : జిల్లా టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న డాక్టర్ కొండమూరి, పెద్దాపురం మండలం దివిలిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు



తాళ్లరేవు మండలం అరటికాయలంకలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ మహిళలు



రౌతులపూడి మండలం ఎస్.పైడిపాలలో తీన్‌మార్‌తో సంబరాలు

కాకినాడ సిటీ, జూన్ 12: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విజయోత్సవ సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ ఆధ్వర్యం వహించారు. తొలుత పార్టీ కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి పంచారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ కొండమూరి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వం రావాలని కోరుకున్నారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి పాలన సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నందిక వెంకటరమణ, సత్యం, వాసిరెడ్డి కుమార్, కొండమూరి గంగాధర్, కాటాడ గోపి, వెంకటరెడ్డి,సలాది రాజేష్ ఉన్నారు. కాకినాడ జగన్నాథపురం వంతెనవద్ద టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో 17, 18 డివిజన్ల నాయకులు చొక్కా గిరి, బి.శివాజీ, జి.గోవిందరాజులు, కేసీవీ ప్రసాద్, బి.చిననాయుడు, వి.రాంబాబు, ఎం.సత్యనారాయణ, కె.గణపతి, శ్రీనివాసు పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కాకినాడలో నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఫౌండేషన్ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు జరిపారు. కార్యక్రమానికి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు ఆధ్వర్యం వహించారు. తొలుత ఎన్టీఆర్, వంగవీటి రంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నా జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు భోజనాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ నగర అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్, సభ్యులు అడపా జగదీష్, రాయవరపు సతీష్‌చంద్ర, పాలిక ప్రసాద్, కర్రి వీరబాబు,నాగబాబు పాల్గొన్నారు.

పిఠాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవ వేళ నియోజకవర్గంలో టీడీపీ సంబరాలు అంబరాన్నంటాయి. పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పలుచోట్ల కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొనేందుకు నాయకులు,కార్యకర్తలు తరలివెళ్లారు. టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ కొండేపూడి సూర్యప్రకాష్, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అల్లవరపు నగేష్, నామా దొరబాబు, ఎస్కే యాసిన్, గుత్తుల రామకృష్ణ పాల్గొన్నారు. రథాలపేట అంబేడ్కర్ సెంటర్ వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యాళ్ల గణేష్, దుర్గాడ విజయలక్ష్మి, లోండా ఆనంద్, కూసి ఏసు, కె.ప్రసాద్, గుర్రాల సత్తిబాబు, బాలరాజు పాల్గొన్నారు.

పిఠాపురం/గొల్లప్రోలు: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రమాణస్వీకారం పట్ల జనసేన శ్రేణులు సంబరాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు గ్రామాల్లో బాణాసంచా కాల్చారు. అలాగే కేక్‌లు కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.

గొల్లప్రోలు: చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం సందర్భంగా గొల్లప్రోలుతో పాటు మండలంలోని గ్రామాల్లో టీడీపీ నేతలు బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రమాణస్వీకారాన్ని వీక్షించారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

కొత్తపల్లి: మండలంలో ప్రజలు సంబరాలు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రిగా పవన్‌ల ప్రమాణస్వీకారోత్సవాన్ని తిలకించారు. ఉప్పాడ తీరప్రాంత గ్రామాల్లో బాణసంచా కాల్చారు. గ్రామస్తులు, ప్రయాణికులకు స్వీట్లు పంచారు.

కోటనందూరు: టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. గ్రామాల్లో బాణసంచా కాల్చి కేక్‌లు కట్ చేశారు. డిచిరీంజీవిరాజు, పెంటకోట భాస్కరసత్యనారాయణ, అంకంరెడ్డి రమేష్, షేక్‌నవాబ్‌జానీ, పెనుముచ్చు నాగేశ్వరరావు, వెలగా వెంకటకృష్ణారావు, యర్ర చినసత్యనారాయణ, పోతల సూరిబాబు, బి.శ్రీరామమూర్తి, గెడ్డం కొండయ్యనాయుడు, మాతిరెడ్డిబాబులు, గుడివాడ అప్పలనాయుడు మాష్టారు, చింతకాయల రవికుమార్, లగుడు సత్యనారాయణమూర్తి,చిటికెల సత్యనారాయణ ఉన్నారు.

పెద్దాపురం: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని పట్టణ, మండల గ్రామాల్లో సచివాలయాల వద్ద, ముఖ్య కూడళ్లలో ప్రజలు, కూటమి నేతలు, కార్యకర్తలు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై వీక్షించారు. పట్టణ పరిధిలోని దర్గాసెంటర్ సమీపంలో ఉన్న సీకే కన్వెన్షన్ హాల్, వెలమ సంక్షేమ భవనం ముప్పన రామారావు వీవర్స్ కమ్యూనిటీ హాల్, అంబే ద్కర్ భవనం, ఎంపీడీవో కార్యాలయం, రూరల్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. భారీ కేక్ కట్ చేయడంతో పాటు బాణసంచా కాల్చారు. పలుచోట్ల ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

సామర్లకోట: సీఎం ప్రమాణస్వీకారం వీక్షించేందుకు సామర్లకోట పట్టణం, మండలంలోనూ పలు ప్రాంతాల్లో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పలువురు బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. సామర్లకోట మున్సిపల్ మెప్మా కార్యాలయంలో కమిషనర్ జాస్తి రామారావు ఆధ్వర్యంలో మెప్మా సీఎంఎం సుజాత పర్యవేక్షణలో డిజిటల్ స్క్రీన్ చేశారు. హుస్సేన్‌పురం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ టీడీపీ నేత చల్లా బుజ్జి ఆధ్వర్యంలో భారీ డిజిటల్ స్క్రీన్ ఏర్పాటుచేసి బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేసి కార్యకర్తలు ఆనందంగా గడిపారు.

తుని రూరల్: తుని టీడీపీ శ్రేణులు పట్టణవాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో సంబరాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకట్రావు కార్యాలయ ప్రాంగణంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. పలువురు భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి సత్యనారాయణ, మాజీ కౌన్సెలర్లు అల్లురాజు, మళ్ల గణేష్, సిద్ధాంతపు సత్తిబాబు, జల్లువాసు ఉన్నారు. కాకినాడ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి) తిమ్మాపురంలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై భారీ కేక్ కట్ చేశారు. మాజీ సర్పంచ్ కాపారపు అబ్బులు, అప్పి అచ్యుతరావు, జనసేన నాయకులు పోల్నాటి గోపికృష్ణ, యడ్ల అప్పలరాజు,అప్పి సత్తిబాబు ఉన్నారు.

గండేపల్లి: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయగా అధికారులు, సిబ్బంది, ప్రజలు సీఎం ప్రమాణస్వీకారోత్సవాన్ని వీక్షించారు. గండేపల్లి ఎన్టీఆర్ విగ్రహం వద్ద గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెలమాటి కాశీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి మండలంలోని పలు గ్రామాల నుంచి కార్లు, వ్యాన్లలో టీడీపీ, జనసేన అభిమానులు, నాయకులు భారీగా తరలివెళ్లారు.

రౌతులపూడి: ఎస్.పైడిపాలలో మాజీ సర్పంచ్‌లు గొల్లు పెద్దదివాణం, ఈగల సత్తిబాబు ఆధ్వర్యంలో తీన్‌మార్ గ్రామమంతా తిరుగుతూ సంబరాలు చేసుకున్నారు. ఎల్‌ఈడీ స్క్రీన్లలో చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు. ప్రమాణస్వీకారానికి టీడీపీ టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, ఎంపీటీసీ యామల సురేష్, యువనేత ఇటంశెట్టి అశోక్ తరలివెళ్లారు.

కరప: ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని కరప మండలపరిషత్ కార్యాలయంతో బాటు మిగిలిన అన్ని ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారంలో అధికారులు, ఉద్యోగులు వీక్షించారు. టీడీపీ, జనసేన నాయకులు, అభిమానులు, కార్యకర్తలు గ్రామాల్లో బాణసంచా కాల్చిమిఠాయిలు పంచి సంబరాలు చేసుకున్నారు.

తాళ్లరేవు: మండలంలో 17గ్రామ పంచాయతీల్లో ప్రమాణస్వీకారం వీక్షణకు టీవీలను ఏర్పాటు చేశారు. ఇంజరం పంచాయతీ పెదగోవలంక, అరటికాయలంక, టీడీపీ కార్యాలయంలో కేకులు కట్ చేసి కార్యకర్తలకు పంచారు. బాణసంచా పేల్చి తీన్‌మార్ డప్పులు వాయించారు. పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామంలో టీడీపీ నేతలు ఎల్‌ఈడీ బోర్డును ఏర్పాటుచేసి బాణసంచా పేల్చారు. పెదగోవలంక, అటికాయలంకలో అన్నదానం నిర్వహించారు. టీడీపీ నేతలు వత్తుమల్లి మురళీకృష్ణ, వేగేశ్న శ్రీనురాజు, కవల కోటేశ్వరరావు, మోర్త భైరవమూర్తి, రేలింగి శ్రీకాంత్ పాల్గొన్నారు.

తొండంగి: ఏ.కొత్తపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన తెరపై సీఎం ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. కేక్ కట్ చేసి బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. వనపర్తి రాజా, నామాల శ్రీను, సంగిశెట్టి రమేష్, అప్పన్న, గోవిందు పాల్గొన్నారు. టీడీపీ యువనేత యనమల రాజేష్ సూచనల మేరకు తొండంగి, ఎల్లయ్యపేట, బెండపూడి గ్రామాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. జిల్లా మత్స్యకార అధ్యక్షులు కోడ వెంకటరమణ,సాధనాల నూకరాజు,బంటుపల్లి అన్వేష్ ఉన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట గోకవరం రోడ్డులో గల సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ నందు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయగా చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు తిలకించారు. టీడీపీ నాయకుడు కొత్త కొండబాబు, పీడీఎఫ్ నాయకులు ఓలేటి సూర్యనారాయణ మాస్టారు. పంచాయతీరాజ్, రెవెన్యూ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్లలో అధికారులు, ప్రజలు సీఎం ప్రమాణస్వీకార మహోత్సవాన్ని వీక్షించారు. ప్రమాణస్వీకారానికి టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో ప్రతీ గ్రామం నుంచి కార్లు, బస్సులు, వాహనాలపై టీడీపీ నాయకులు వెళ్లారు.

ప్రత్తిపాడు: టీడీపీ శ్రేణులు మండల గ్రామ పంచాయతీల వద్ద ఎల్‌ఈడీలు స్క్రీన్‌లు ఏర్పాటు చేయగా అభిమానులు, కార్యకర్తలు, అధికారులు, ఉద్యోగులు, సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు.

సుపరిపాలనకు కృషి : రాజప్ప

సామర్లకోట, జూన్ 12: రాష్ట్రంలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మంత్రివర్గం అంతా సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తుందని, కూటమి ప్రభుత్వంపై ప్రజలకు సైతం నమ్మకం ఉందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రివర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం సామర్లకోటలో విలేకర్లతో రాజప్ప మాట్లాడారు. మంత్రివర్గంలో సీనియర్లు, జూనియర్లకు సమాన ప్రాతినిధ్యం ఇచ్చారన్నారు. ఇక నుంచి అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తుందని తదను గుణంగా ప్రజల ఆశలు, ఆశయాలు తీర్చే విధంగా పనిచేయగలదని అభిప్రాయపడ్డారు.




తునిలో సీఎం ప్రమాణస్వీకారం వీక్షిస్తున్న దృశ్యం, కరప ఎంపీడీవో కార్యాలయంలో వీక్షిస్తున్న అధికారులు




సామర్లకోట మెప్మా కార్యాలయంలో డిజిటల్ స్క్రీన్, గండేపల్లిలో ప్రమాణస్వీకారాన్ని వీక్షిస్తున్న ప్రజలు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 12: ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. కాకినాడ కళాక్షేత్రంలో బుధవారం టౌన్‌ప్లానింగ్, ఎమినిటీ, శానిటేషన్ సెక్రటరీలతో కమిషనర్ సమావేశమయ్యారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పరిష్కరించాల్సిన సమస్యలు, ఇతర అంశాల విషయంలో సచివాలయ కార్యదర్శులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, కార్యదర్శి ఏసుబాబు, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి ఉన్నారు.

'సృజనాత్మకత వెలికితీసేందుకు వేసవి శిబిరం'

సర్పవరం జంక్షన్, జూన్ 12: వేసవి శిబిరం కార్యక్రమం విద్యార్థులకు డ్రాయింగ్, లెక్కలు, ఇంగ్లీషు, చదవడం, రాయడం వంటివాటిపై ఇచ్చిన శిక్షణ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు దోహదపడుతుందని సీఐటీయూ కాకినాడ రూరల్ కన్వీనర్ టి.రాజా అన్నారు. వలసపాకల సుందరయ్య చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు వేసవి వినోదం పేరుతో 9 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. పేద విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ సెంటర్ నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రభాకర్ వర్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నగేష్, చక్రవర్తి తెలిపారు. డ్రాయింగ్‌లో రాణించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. యూటీఎఫ్ అసోసియేట్ అధ్యక్షులు వీవీరమణ, ఎండి తనిషా, నాగరాజు, ఎం.వెంకటరమణ, డి.సత్యనారాయణ, సత్తిబాబు ఉన్నారు.

'ముమ్మరంగా బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే'

సామర్లకోట, జూన్ 12: సామర్లకోట పట్టణం, మండలంలోనూ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నట్టు ఎంఈవో వై.శివరామకృష్ణయ్య తెలిపారు. బుధవారం పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న సర్వే తీరును ఎంఈవో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన చిన్నారులందరికీ పుస్తకాలు, షూలు, యూనిఫాం దుస్తులు తదితర బేగ్‌లతో కూడిన కిట్లను అందజేస్తామన్నారు. రోజూ పౌష్టికాహారాన్ని అందిస్తామన్నారు. గురువారం నుంచి మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు తెరిచే విధంగా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ, వైకుంఠం, శ్రీనివాస్, ఏఎల్వీ.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒమ్మంగిలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రత్తిపాడు, జూన్ 12: ప్రపంచ బాలకార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు మండలం లీగల సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ఒమ్మంగి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్యానల్ న్యాయవాది కుసుమంచి సూర్యప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో బలాజ్ సభ్యుడు బుగతా శివ, సీనియర్ న్యాయవాదులు అవసరాల దేవి, బొంగుకూరు మధుబాబు మాట్లాడుతూ బాలకార్మికులను వెట్టి చాకిరి నుంచి విముక్తిలను చేసి బడికి పంపాలన్నారు. వారిని పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని తెలిపారు. సమావేశంలో ఉపసర్పంచ్ కొప్పన వెంకన్నబాబు, ఎంపీటీసీ సాధనాల అప్పారావు, గ్రామపెద్దలు రామిశెట్టి నాని, కొప్పన గంగారావు, గోపు వీరబాబు, మాదేపల్లి శ్రీనివాసు, కొప్పన రాంబాబు, గువ్వా వెంకన్నబాబు, జక్కా విష్ణు, కొప్పన భుజంగరావు ఉన్నారు.

19న హిందూమత సమ్మేళనం

జగ్గంపేట, జూన్ 12: హైదరాబాద్‌లో అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఇక్వాలిటీ ఆధ్వర్యంలో ఈనెల 19న హిందూమత సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు విజయశంకర స్వామి, సాధుత్రినాథదాస్ తెలిపారు. జగ్గంపేటలోని మల్లిసాల ఆశ్రమం యోగి సిద్ధరామయ్య ఆధ్వర్యంలో బుధవారం సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. హిందూమతం ఒక విశాలమైన వ్యవస్థని యోగి సిద్ధరామయ్య అన్నారు. కార్యక్రమంలో హెపీఈ జాతీయ కార్యదర్శి ఖదిజ్నాసి యోధ రాఘవదాసు, జై భారత్ జాతీయ అధికార ప్రతినిధి యోధ లిఖితావల్లభ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

సర్పవరం జంక్షన్, జూన్ 12: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో మీ కోసం సంస్థ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నితావ్యసర సరుకులను జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్ వెంకట్రావు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమాజ సేవ కోసం సభ్యులు ఉన్నంతలో నిరుపేదల సేవకు వెచ్చించడం, ప్రాణాంతక వ్యాధిగ్రస్తుల కోసం ప్రతీ నెలా నిత్యవసరాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, డాక్టర్ సువర్ణరాజు, సందీప్, బాబీ, శివ, స్వామి, సుబ్బారావు చింతపల్లి పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందిని పెంచాలని వినతి

సామర్లకోట, జూన్ 12: పట్టణంలో పెరుగుతున్న జనాభా పారిశుధ్య అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని పెంచకపోవడంతో ఉన్న కొద్దిపాటి సిబ్బందిపై పనిఒత్తిడి పెరుగుతుందని, మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిని పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. సత్వరం నూతనంగా నియామకాలు చేయలాని కోరారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘ నాయకులు శ్రీను, కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

సామర్లకోటలో అగ్నిప్రమాదం

సామర్లకోట, జూన్ 12: పట్టణ శివారున గల కుమ్మరివీధిలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ.60 వేలు గల ఆస్తినష్టం జరిగింది. వంట చేస్తున్న సమయంలో గ్యాస్ సిలెండర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో మోర్త మునసయ్యకు చెందిన తాటికిళ్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. వీఆర్వో సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టంపై నివేదికలను సామర్లకోట తహశీల్దార్‌కు అందజేశారు.

సొంత ఖర్చులతో పూడిక తీత పనులు

కొత్తపల్లి, జూన్ 12: నీటిపారుదలశాఖ సిబ్బంది నిర్లక్ష్యంతో పూడుకుపోయిన పంట కాలువలో కొత్తపల్లికి చెందిన కౌలు రైతులు సొంత ఖర్చులతో పూడిక తీయించుకునే పనులు చేపట్టారు. కొత్తపల్లిలో సుమారు 100 ఎకరాల రైతువారీ భూమిని 40 మంది రైతులు కౌలుకు తీసుకున్నారు. పెద్ద చెరువు నెం1 మూలతూము నుంచి ఉప్పాడ శివారు పల్లిపేట వరకు ఉన్న సమారు 2కిలోమీటర్ల పంట కాలువ ద్వారా వచ్చే సాగు నీరుతో కౌలుకు తీసుకున్న భూములకు నీరు ప్రవహించాలి. చాలాకాలంగా పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించకపోవడంతో చేలకు నీరందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరందక పంటల దిగుబడులు రాకపోవడంతో పెట్టుబడి సొమ్ములు రాక కౌలు రైతులందరూ ఎకరానికి రూ.100 వంతున వేసుకొని ప్రొక్లెయిన్‌తో పంట కాలువ పూడిక తీయించుకునేందుకు సన్నద్ధమయ్యామని కౌలు రైతు గంధం కృష్ణ తెలిపాడు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పూడుకు పోయిన పంట కాలువల్లో పూడిక తీయించేందుకు చర్యలు చేపట్టాలని కౌలు రైతులు కోరుతున్నారు.



కొత్తపల్లిలో పంట కాలువలో పూడిక తీయించుకుంటున్న కౌలు రైతులు

బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 12: దుమ్ములపేటలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, కార్మికశాఖ, సెంటర్ ఫర్ వరల్డ్ సోలిడారిటీ వారి ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు అధ్యక్షతన అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం బుధవారం నిర్వహించారు. స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కొండా ప్రవీణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ బాలలందరూ బడిలో ఉండాలని, పనిలో కాదన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్ బుల్లిరాణి, సెంటర్ ఫర్ సోలిడారిటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఏఆర్ సుబ్రహ్మణ్యం, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఏఎల్ఎస్ హరికృష్ణ, సీడీపీవో జ్యోతి, క్రాప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి స్వర్ణలత ఉన్నారు.

కాంప్లెక్స్‌లోకి దూసుకొచ్చిన బస్సు

మహిళకు తీవ్ర గాయం



గాయపడిన మహిళ

జగ్గంపేట, జూన్ 12: ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి బస్సు ప్రయాణికుల మీదకు దూసుకురాగా ఒక మహిళ తీవ్రంగా గాయ పడింది. బుధవారం ఏలేశ్వరం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ఆర్టీసీ బస్సు జగ్గంపేటలోని ఆర్టీసీ డిపోకు వచ్చేసరికి బ్రేక్ పనిచేయలేదు. ప్లాట్‌ఫాం వద్దకు వస్తుండగా డ్రైవర్ బస్సుకు బ్రేక్ వేసినా ఆగలేదు. బస్సు ముందుకు దూసుకురావడంతో ఒక మహిళ కాలు నుజ్జునుజ్జయింది. ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. క్లచ్‌హార్డ్ కావడం తోనే బస్సు బ్రేక్ పనిచేయలేదని డ్రైవర్ తెలిపాడు.

హైవే డివైడర్‌పైకి ట్రాలీ లారీ



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు-యర్రవరం 16వ నెంబరు జాతీయ రహదారిపై ట్రాలీలారీ అదుపు తప్పి డివైడర్‌పై దూసుకు వచ్చింది. రాజమహేంద్రవరం నుంచి విశాఖ వెళ్తున్న ఈ ట్రాలీ లారీ పాదాలమ్మ గుడి, చిన్నింపేటల మధ్యలో అదుపుతప్పివేగంగా డివైడర్ పైకి దూసుకువచ్చింది. ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

వృథాగా పోతున్నా పట్టించుకోరా?

జగ్గంపేట, జూన్ 12: జగ్గంపేట మండలం గుర్రప్పాలెనికి వెళ్లేదారిలో పెద్ద కాలువ బ్రిడ్జి కుడిపక్క ఉన్న పైపులైన్ లీకై కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. దీంతో వాహనదారులు జారి గాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



మంత్రి నాదెండ్లను అభినందించిన నానాజీ



మంత్రి మనోహర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, జూన్ 12: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాదెండ్ల మనోహర్‌ను బుధవారం విజయవాడలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మర్యాద పూర్వకంగా కలుసుకుని బొకే అందించి శాలువా కప్పి అభినందించారు. సుదీర్ఘకాలం జనసేన పార్టీ అభివృద్ధి, బలోపేతం కోసం పార్టీ అధ్యక్షుడు, పవన్ కల్యాణ్‌తో కలసి పయనించడం, ఇప్పుడు ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉండడం ఎంతో ఆనందాన్నిస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. నానాజీ మేనల్లుడు బున్ను మనోహర్‌ని కలుసుకున్నారు.

చంద్రబాబును కలిసిన అనంతలక్ష్మి


రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబును బుధవారం ఉండవిల్లిలో కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి దంపతులు మర్యాద పూర్వకంగా కలుసుకుని బొకే ఇచ్చి శాలుశాతో సత్కరించి అభినందనలు తెలిపారు. జనసేన కూటమి అభ్యర్థి పంతం నానాజీని అత్యధిక మెజారిటీతో విజయం సాధించేలా కృషి చేసినందుకు పిల్లి దంపతులను చంద్రబాబు అభినందించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

పవర్‌లిఫ్టింగ్‌లో విజేతకు సత్కారం



కార్పొరేషన్(కాకినాడ), జూన్ 12: కాకినాడ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు ఈనెల 8,9 తేదీల్లో విశాఖపట్నం పెదగంట్యాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 3 కేటగిరీల్లో ప్రథమ స్థానంలో నిలిచి 3 బంగారు పతకాలు పొందారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డ్రైవర్‌ను ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి సంస్థకు మంచి పేరు తీసుకోవాలన్నారు. డిపో మేనేజర్ ఎంయుపీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంటిలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



ప్రదర్శనలో ఉత్పత్తులతో మోడల్

సర్పవరంజంక్షన్, జూన్ 12: రాబోయేది పండుగల సీజన్ దృష్ట్యా ఫ్యాషన్ ప్రియులు కోసం వన్‌స్టాప్ సొల్యూషన్‌గా అన్ని వస్తువులను ఒకే వేదిక మీదకు తెస్తూ కాకినాడ ఎస్ఆర్ఎంటీలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రదర్శను బుధవారం ప్రారంభించారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేత కారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని, ఈ నెల 17న తో ప్రదర్శన ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

బీజేపీలో చేరిన బోస్

ఏలేశ్వరం, జూన్ 12: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సమక్షంలో ఏలేశ్వరానికి చెందిన పైల సుభాష్ చంద్రబోస్ బీజేపీలో చేరారు. బుధవారం వైసీపీని వీడి విజయవాడ బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామకుమార్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.